సాక్షి
నంద్యాల
మంగళవారం । 15 । అక్టోబర్ । 2024



శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించారు. అనంతరం వెండి రథంపై ఉత్స వమూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేపట్టారు.



రమణీయం..రథోత్సవం

దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి రథోత్సవం సోమవారం రాత్రి రమణీయంగా సాగింది. వేలాది మంది భక్తజనం తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1.633
ప్రస్తుతం	:1,631.97
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:101.656
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:82,504
అవుట్ ఫ్లో	:82,324

న్యూస్‌రీల్

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

బొమ్మలసత్రం: సైబర్ నేరగాళ్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సిం గ్‌రాణా హెచ్చరించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. ఫిర్యాదుల్లో అధికంగా అత్తింటి వేధింపులు, నగదు మోసాలు ఉన్నాయన్నారు. ఈమధ్య కాలంలో సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాల ద్వారా ప్రజల అకౌంట్లలోని సొమ్మును కాజేస్తు న్నారన్నారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి అకౌంట్ నంబర్ తదితర వివరాలు అడిగితే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ యుగంధ ర్‌బాబు తదతరులు ఉన్నారు.

వీబీఆర్‌కు జలకళ

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయ ర్ సోమవారం 16.452 టీఎంసీల నీటితో జల కళను సంతరించుకుంది. బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింకు చానల్ ద్వారా వీబీఆ ర్‌లోకి 5,650 క్యూసెక్కుల కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నట్లు తెలుగుగంగ ఏఈ శివ నాయక్ తెలిపారు. వీబీఆర్ నుంచి మద్రాస్ కాలువకు 5,100 క్యూసెక్కులు, వన్ ఆర్ తూముకు 55 క్యూసెక్కులు, వన్ ఎల్ తూముకు 30 క్యూసెక్కులు నీటిని దిగువకు పంపుతున్నట్లు తెలిపారు. రిజర్వాయర్ ప్రధాన రహదారికి దగ్గర ఉండడంతో వన్ ఆర్ తూము వద్ద శ్రీశై లం, మహానందికి వెళ్లే యాత్రికులు స్నానాలు ఆచరిస్తున్నారు.

శ్రీశైలంలో 202 టీఎంసీలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల జలాశయంలో సోమవారం సాయంత్రం సమయానికి 202.0439 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూరాల, సుంకేసుల నుంచి 1,43,121 క్యూసెక్కుల వరద ప్రవాహం జలాశ యానికి వస్తుండగా ఇక్కడి నుంచి దిగువ ప్రాజె క్టులకు 52,851 క్యూసెక్కులు విడుదల చేశారు. కుడిగట్టు కేంద్రంలో 7.950 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 11.472 మిలి యన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం డ్యాం నీటిమట్టం 882.50 అడుగులకు చేరుకుంది.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి

నంద్యాల(అర్బన్): గ్రామాల అభివృద్ధే లక్ష్యం గా పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మైనారిటీ సంక్షేమం, న్యాయ శాఖ మంత్రి ఫరూక్ అన్నారు. నం ద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో సోమవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. రూ.28 లక్షల వ్యయంతో గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేసి మాట్లాడారు. పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ నాగరాజు, డ్వామా పీడీ జనార్దన్‌రావు, ఆర్డీఓ మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

రేపు ఉచిత గ్రహణ మొర్రి స్క్రీనింగ్ క్యాంప్

కర్నూలు కల్చరల్: నగరంలోని సమగ్ర శిక్షా కార్యాలయంలో ఈనెల 16వ తేదీ ఉదయం 9 గంటలకు ఉచిత గ్రహణ మొర్రి (పెదవి చీలిక అంగిలి చీలిక) స్క్రీనింగ్ క్యాంప్‌ను నిర్వహిం చనున్నట్లు సమగ్ర శిక్షా ప్రాజెక్టు కో ఆర్డినేటర్, జిల్లా విద్యా శాఖ అధికారి కె.సామ్యుయేల్ ఒక ప్రకటనలో తెలిపారు. బసవ తారకం స్మైల్ ట్రైన్ సెంటర్, బసవతారకం ఇండో అమెరికన్ క్యా న్సర్ హాస్పిటల్ వారి డాక్టర్ ముకుంద రెడ్డి ఆధ్వ ర్యంలో నిర్వహించే శిబిరానికి గ్రహణ మొర్రి గల 6 నెలల నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు హాజరు కావచ్చని తెలిపారు.

కేఎంసీ కీర్తి ప్రతిష్టలు పెంచాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ కీర్తి ప్రతిష్టలను మరింత పెంచేలా వైద్య విద్యా ర్థులు చదువుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ సూచించారు. 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ తీసుకున్న మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులకు సోమవారం కళాశాలలోని న్యూ లెక్చర్ గ్యాలరీలో రెండు వారాల ఫౌండేషన్ కోర్సు ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో మెలగాలని, హాజరుశాతం 75 శాతానికి తగ్గకుండా ఉండాలని సూచించారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ సి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కాలేజీలో చేరిన ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలన్నారు.

తమ్ముళ్ల గుప్పిట్లో మద్యం!

- ముగిసిన ఎక్సైజ్ టెండర్లు
- అత్యధిక శాతం దుకాణాలు టీడీపీ నేతలకే
- మిగిలిన దుకాణాల్లోనూ వాటా ఇవ్వాలంటూ బెదిరింపులు
- సామాన్యులకు తప్పని నిరాశ
- రేపటి నుంచి నూతన మద్యం విధానం అమలు

ఇక మద్యం ఏరులై పారనుంది. ప్రైవేట్‌లో మద్యం అమ్మకాలకు కూటమి సర్కారు పచ్చజెండా ఊపడంతో తెలుగు తమ్ముళ్లు బరిలోకి దిగారు. ఇతరులెవ్వరికి అవకాశం ఇవ్వకుండా సిండికేట్‌గా ఏర్పడి మద్యం వ్యాపారాన్ని గుప్పిట్లోకి తెచ్చుకున్నారు. సోమవారం నిర్వహించిన లక్కీడిప్‌లో జిల్లాలో అత్యధిక దుకాణాలు తెలుగుతమ్ముళ్లే దక్కించుకు న్నారు. కొన్ని ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో కొందరికి రెండేసి దుకాణాలు దక్కడం గమనార్హం. ఈ ప్రక్రియను చూస్తే నూతన మద్యం పాలసీ తెలుగుతమ్ముళ్ల కోసమే తీసుకొచ్చినట్లు సుస్పష్టమవుతోంది.



మద్యం దుకాణాల కేటాయింపునకు లక్కీడిప్ నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి



వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో లక్కీడిప్‌నకు హాజరైన దరఖాస్తుదారులు

బొమ్మలసత్రం: చంద్రబాబు గత పాలన (2014–19)లో కోట్ల రూపాయలు కొల్లగొట్టిన తెలు గుతమ్ముళ్లు ఈసారి కూడా తమకు కలసి వస్తుం దనే బలమైన నమ్మకంతో బరిలోకి దిగి నియోజకవ ర్గాల వారీగా గరిష్ట సంఖ్యలో మద్యం దుకాణాలను దక్కించుకున్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ఉన్న వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో దుకాణాల కేటాయింపు కార్యక్రమాన్ని ఎక్సైజ్ అధికారులు నిర్వహించారు. ఉదయం 6 గంటలకే టీడీపీ నాయకులు అక్కడికి పెద్ద సంఖ్యలో చేరుకు న్నారు. 8 గంటల సమయంలో కలెక్టర్ రాజకుమారి మద్యం దుకాణాల దరఖాస్తు దారుల జాబితాను పరిశీలించి లక్కీడిప్ నిర్వహిం చారు. గెజిట్ నంబర్ల ఆధారంగా దుకాణాల లైసెన్స్ ఇచ్చారు. కాగా వైఎస్సార్‌సెంటినరీ హాల్ వద్ద జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ భద్రత ఏర్పాటు చేశారు.

105 దుకాణాలకు 2,221 దరఖాస్తులు

జిల్లాలోని ఏడు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని 105 మద్యం దుకాణాలకు ఈ నెల 1వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించిన సంగతి తెలి సిందే. ముందుగా వెల్లడించిన షెడ్యూల్ ప్రకారం 9వ తేదీకే గడువు ముగిసినా తెలుగు తమ్ముళ్ల కోసం ప్రభుత్వం గడువును మూడు రోజులు పెంచింది. దీంతో చివరి నిమిషంలో అధికార పార్టీ నేతలు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. అన్ని షాపులకు కలిపి 2,221 దరఖాస్తులు వస్తే వీటిలో 2 వేలకు పైగా టీడీపీ నాయకులవే కావడం గమనార్హం.

హాల్ నిండా అధికార పార్టీ నాయకులే...

మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు టీడీపీ నేతలు కుయుక్తులు పన్నారు. తమ వద్ద నమ్మకంగా ఉన్న కొంత మంది పేర్లతో ముందుగానే రూ. 2 లక్షలు డిపాజిట్ చేయించి దరఖాస్తు చేయించారు. ఒక్కో దుకాణానికి దాదాపు 95 శాతం దరఖాస్తు దారులు అధికారపార్టీ నేతల బినామీలే కనిపించారు. మద్యం దుకాణాల కోసం ఎక్కువగా ఆళ్లగడ్డకు చెం దిన అధికారపార్టీ నేతలు ఉత్సాహం చూపించారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ ప్రాంతానికి చెందిన కొం దరు కల్తీ మద్యం తయారు చేసి బెల్టు షాపులకు విక్ర యించి సొమ్ము చేసుకున్నట్లు విమర్శలు ఉన్నాయి.

సామాన్యుడికి మొండి చెయ్యి...

మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు సామాన్యుల్లో కొందరు రూ. 2 లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. అయితే, లక్కీడిప్‌లో అధిక శాతం టీడీపీ నేతల బినామీలకే దుకాణాలు దక్కటంతో వారంతా నిరాశతో వెనుదిరిగారు. అధి కారులు పారదర్శకంగా కార్యక్రమం నిర్వహించిన టీడీపీ నేతల అత్యుత్సాహం ముందు సామాన్యుడు తట్టుకోలేకపోయాడు. ఒక్కో నేత బినామీలతో కలిసి 50 దుకాణాలకు పైగా దరఖాస్తు చేసుకుంటే ఇక సామాన్యుడికి సంబంధించిన నంబర్ అధి కారుల చేతికి రావటం నీటిమీద రాతల మారింది.

అధికశాతం సిండికేట్‌కే

మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు తెలుగు దేశం పార్టీ నాయకులు తీవ్రంగా పోటీ పడ్డారు. సిం డికేట్‌గా మారి ఇతరలెవ్వరూ పోటీ పడకుండా జాగ్రత్త పడ్డారు. దీంతో కొలిమిగుండ్ల, కోవెలకుం ట్ల, బనగానపల్లె, బండి ఆత్మకూరు, పాణ్యం మం డలాల్లోని షాపుల్లో 95 శాతం కూటమి నాయకులు, వారి అనుచరులకే దక్కాయి.

- ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని 18 షాపులకు 275 మంది దరఖాస్తు చేసుకోగా ఇందులో 17 మందికి లక్కీడ్రాలో అదృష్టం వరించింది. అన్నెం అంజనకు మార్‌రెడ్డికి ఆళ్లగడ్డ , రూరల్ మద్యం షాప్‌నెంబర్లు 37, 40 దక్కడం విశేషం.
- బనగానపల్లె మండలంలో మొత్తం ఏడు దుకాణాల్లో ఐదు కూటమి నాయకులే దక్కించుకు న్నారు. ఇందులో అధికారపార్టీకి చెందిన బీసీ మద న్‌భూపాల్‌రెడ్డికి 56, 59 దుకాణాలు దక్కాయి.
- బండి ఆత్మకూరు మండలంలోని మూడు మద్యం దుకాణాలు (15, 16, 17 నంబర్లు) అధి కారపార్టీకి చెందిన వారికే దక్కాయి. పిట్టం రాజశే ఖర్‌రెడ్డి అనే వ్యక్తికి రెండు, పిట్టం వెంకట సుబ్బారె డ్డికి ఒకటి దక్కడం గమనార్హం.

దుకాణాల కోసం పైరవీలు...

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ దుకాణాలకు అద్దెకు ఇచ్చిన కొందరు వ్యాపారులు చక్రం తిప్పు తున్నారు. రెండు వారాల ముందుగానే ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న దుకాణాలకు అడ్వాన్స్ ఇచ్చి దుకాణాలను ఎక్కడికక్కడ బ్లాక్ చేశారు. ఇప్పుడు వారికి కాకుండా వేరే వ్యక్తులు లైసెన్స్‌లు పొందిన చోట తమకు కూడా వాటా ఇవ్వాలంటూ దారిలోకి తెచ్చుకునే ప్రయత్నాలు ముమ్మరమ య్యాయి. నంద్యాల, ఆళ్లగడ్డ, శ్రీశైలం, బనగాన పల్లె, డోన్ నియోజకవర్గాల్లో దుకాణాల కోసం పైరవీలు ముమ్మరమయ్యాయి. ఆయా నియో జకవర్గాల్లో కొత్తగా దుకాణాలు దక్కించుకున్న వారిని అధికార పార్టీ నాయకులు బెదిరిస్తున్నట్లు సమాచారం. ఈనెల 16వ తేదీ నుంచి నూతన మద్యం విధానం అమలులోకి రానుంది.

పోటీపడిన మహిళలు

బొమ్మలసత్రం: జిల్లాలోని 105 మద్యం దుకా ణాల్లో ఆరింటిని మహిళలు దక్కించుకున్నారు. ఇందులో 70 నంబర్ బేతంచెర్ల దుకాణం దివం గత నంద్యాల ఎంపీ ఎస్పీవై రెడ్డి కుమార్తె సుజల, నంద్యాల పట్టణంలోని 4వ నంబర్ దుకాణం నాగవేణి, చాగలమర్రిలో 43వ దుకాణం సావిత్రి , కోవెలకుంట్లలో 82వ దుకాణం రాజేశ్వ రి, 85 దుకాణం వరలక్ష్మి, పాములపాడులో 100 వ నంబర్ దుకాణం సరోజమ్మ దక్కించుకు న్నారు. కాగా మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డి కుమార్తె సుజల నంద్యాల జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులు చేసుకుని పలు దుకా ణాలు దక్కించుకున్నారు. ఈమెకు పత్తికొండ, మైదుకూరులో ఒక్కొక్కటి చొప్పున, అన్న మయ్య జిల్లా, పీలేరు, కలికిరి, జమ్ములమడుగు ప్రాంతాల్లో రెండేసి చొప్పున 8 దుకాణాలు దక్కాయి.

పారదర్శకంగా మద్యం దుకాణాల కేటాయింపు

నంద్యాల(అర్బన్): జిల్లాలో 105 మద్యం దుకాణాల కేటాయింపు పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ రాజ కుమారి తెలిపారు. స్థానిక సెంటీనరి హాల్‌లో నిర్వహించిన మద్యం దుకాణాల లక్కీ డిప్ ప్రక్రియలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 16 నుంచి నూతన మద్యం పాలసీ అమలు కానుంద న్నారు. 105 మద్యం దుకాణాల లైసెన్స్‌లకు 2,221 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటి ద్వారా రూ. 40.42 కోట్లు వసూళ్లు అయింద న్నారు. లక్కీ డిప్ ద్వారా ప్రతి దుకాణా దారునికి టోకన్ నెంబర్ కేటాయించి ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ జిల్లా అధికారి రవికుమార్, ఏఎస్పీ తదితరులు పాల్గొన్నారు.

శనగ విత్తనాలు ఇంకెప్పుడిస్తారు?

- అక్టోబర్ నెల 15వ తేదీ వచ్చినా అరకొర పంపిణీ
- జిల్లా పరిషత్ ఛైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి



మాట్లాడుతున్న యర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు(అర్బన్): ప్రస్తుత రబీ సీజన్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 60 నుంచి 80 శాతం మంది రైతులు సాగు చేసే శనగ విత్తనాల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రం శ్రద్ధ చూపించడం లేదని జిల్లా పరిషత్ ఛైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి విమ ర్శించారు. సోమవారం సాయంత్రం జెడ్పీలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో పాపిరెడ్డి మాట్లాడుతూ.. బహిరంగ మార్కెట్‌లో శనగ విత్తనాలు క్వింటా రూ.7 వేల నుంచి రూ.7,200 ధర ఉందని, ప్రభుత్వ ధర క్వింటాకు రూ.9,400గా నిర్ణయించి 25 శాతం సబ్సిడీతో రైతు లకు క్వింటాకు రూ.7,050లకు అందిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో 40 శాతం సబ్సిడీతో రైతు లకు నాణ్యమైన శనగ విత్తనాలను సకాలంలో అం దించారన్నారు. ప్రస్తుతం పలు మండలాల్లో పంపిణీ చేస్తున్న శనగ విత్తనాలు నాణ్యత లోపించడం వల్ల రైతులు, సంబంధిత అధికా రులే తిప్పి పంపిస్తున్నారన్నారు. వైఎస్ జగన్ పాలనలో డబ్బు చెల్లిం చిన రోజే విత్తనాలను అందించార ని, ప్రస్తుతం డబ్బు చెల్లించినా వారం, 10 రోజులకు కూడా విత్త నాలు అందించలేని పరిస్థితి కనిపి స్తోందని ఆరోపించారు. సెప్టెంబర్ 25వ తేదీ నాటికి అవసరమైన శనగ విత్తనాలను అందుబాటులో ఉంచుకోవాలని గతంలో జరిగిన జెడ్పీ స్థాయి సంఘ సమావేశా ల్లోనే వ్యవసాయ శాఖ అధికారులను కోరామని, అక్టోబర్ నెల సగం గడుస్తున్నా అరకొర పంపిణీ చేశారన్నారు. విత్తనాలు అందుబాటులో లేక పోవడం వల్ల రెండు జిల్లాల్లో రైతులు నష్టపో వాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందిస్తామని చెప్పిన కూటమి ఇప్పటి వరకు నయాపైసా అందించలేదని విమర్శించారు.

టెట్‌కు 25 మంది గైర్హాజరు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రాజీవ్ గాంధీ మెమోరియల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉపా ధ్యాయ అర్హత పరీక్ష (టెట్) సోమవారం ప్రశాంతం గా జరిగింది. 25 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హా జరయ్యారు. ఉదయం సెషన్‌లో నిర్వహించిన పరీ క్షకు 160మందికి గాను 144 మంది హాజరుకాగా, మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన పరీక్షకు 60 మం దికి గాను 51 మంది హాజరైనట్లు డీఈఓ సుధాకర్ రెడ్డి తెలిపారు.

17న రాష్ట్రస్థాయి పెన్సింగ్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 17వ తేదీ నుంచి పట్ట ణంలోని ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి యూ–14, 17 పెన్సింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న జరగాల్సిన అండర్–14,17 బాల బాలికల కబడ్డీ, చెస్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు వాతావరణ పరిస్థి తుల కారణంగా వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఉమ్మడి జిల్లాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు గమనించాలన్నారు.

పకడ్బందీగా 'కార్తీక' ఏర్పాట్లు



వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఈఓ పెద్దిరాజు

- నవంబర్ 2 నుంచి ప్రతి సోమవారం లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి
- పౌర్ణమి రోజున పుణ్యనదీహారతి, జ్వాలాతోరణోత్సవం
- కార్తీక మాసోత్సవాల సన్నాహక సమావేశంలో శ్రీశైల దేవస్థానం ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో నవంబరు 2 నుంచి డిసెంబరు 1వ తేది వరకు నిర్వహించే కార్తీక మాసోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు అధికారులను ఆదేశిం చారు. సోమవారం దేవస్థాన పరిపాలన భవనం లోని సమీక్షా సమావేశ మందిరంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. దేవస్థాన డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఆర్.రమణమ్మ, ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజీనాయక్, శ్రీశైలం సీఐ ప్రసాద రావు, చంద్రబాబు తదితరులు పాల్గొన్న ఈ సమా వేశంలో ఈఓ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాల న్నారు. ఈ నెల 31లోపు అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలన్నారు. ముఖ్యంగా కార్తీక సోమవారాలు, పౌర్ణమి, శుద్ధ బహుళ ఏకాదశి, ప్రభుత్వ సెలవురోజుల్లో భక్తులరద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పాతాళగంగ వద్ద శౌచాల యాలు, మహిళలు దుస్తులు మార్చుకునే గదులు, మెట్లమార్గంలో, గంగాభవానీ స్నానఘట్టాల్లో అవ సరమైన మరమ్మతులు వెంటనే చేపట్టాలని ఆదేశిం చారు. కార్తీక మాసం రద్దీ రోజుల్లో కార్యాలయ సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు. వేకువ జామున 3గంటలకు ఆలయ ద్వారాలు తెరచి ప్రాతఃకాల పూజల అనంతరం 4.30గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దర్శనాలు, తిరిగి సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 11గంటల వరకు దర్శనాలు యథావిధిగా కొనసాగుతాయ న్నారు. కార్తీక మాసమంతా స్వామివారి గర్భాలయ అభిషేకాలు పూర్తిగా నిలుపుదల చేస్తున్నట్లు తెలి పారు. కార్తీకదీపారాధన చేసుకునేందుకు వీలుగా ఆలయ ఉత్తరమాఢవీధిలో, గంగాధర మండపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయ పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి, పాతాళగంగ వద్ద పుణ్యనదీహారతి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

కీలక పోస్టులన్నీ ఖాళీ!

- ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్న జల వనరుల శాఖ
- ఉమ్మడి జిల్లాలోని 5 సర్కిళ్లలో రెండింటిలోనే రెగ్యులర్ ఎస్ఈలు
- మిగిలిన సర్కిళ్లలో ఇన్‌చార్జ్‌లు
- కీలక స్థానాల కోసం అధికార పార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ఈఈలు



కర్నూలు సిటీ: రాయలసీమ జిల్లాల్లోనే కర్నూలు ప్రాజెక్ట్ చీఫ్ ఇంజినీర్ విభాగం ముఖ్యమైనది. దీని పరిధిలో కర్నూలు సర్కిల్, తెలుగుగంగా, ఎస్ఆర్ బీసీ సర్కిల్–1, సర్కిల్–2, శ్రీశైలం డ్యాం నిర్వహణ విభాగాలు ఉన్నాయి. ఇందులో శ్రీశైలం, ఎస్ఆర్‌బీసీ సర్కిల్–1లో మినహా మిగిలిన మూడు సర్కిళ్లలో రెగ్యులర్ ఎస్ఈలు లేకపోవడంతో పాలన కుంటుప డింది. ఇటీవలే ఈ శాఖలో బదిలీలు జరిగాయి. ఆయా సర్కిళ్ల ఎస్ఈలుగా అదనపు బాధ్యతలు నిర్వ హిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల (ఈఈలు)కు బదిలీలు అయ్యాయి. దీంతో వారు కొత్త స్థానాల్లో చేరారు. అయితే, వారి అదనపు బాధ్యతలను ఇప్పటి వరకు సర్కారు ఎవరికి అప్పగించకపోవడం తో ఇతర జిల్లాల్లో నుంచి బదిలీపై జిల్లాకు వచ్చిన ఈఈలు కర్నూలు సర్కిల్ ఎస్ఈ పోస్టు అదనపు బాధ్యతల కోసం అధికార పార్టీకి చెందిన మం త్రులు, ఎంపీ, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తు న్నారు. రాష్ట్ర ప్రభుత్వం జల వనరుల శాఖలోని నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సిద్ధమ వుతూ ఇటీవలే ఎన్నికల షెడ్యూల్ జారీ చేసింది. ఇలాంటి సమయంలో ప్రస్తుతం అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న వారినే ఎస్ఈలుగా కొనసాగించాలా? లేకపోతే మరొకరికి అప్పగించాలా అన్నది తేలకపో వడంతో ఆ శాఖ ఉన్నతాధికారులు తలలు పట్టుకుం టున్నారు.

అడహక్ పదోన్నతులిచ్చే యోచన!

జల వనరుల శాఖలో పదోన్నతుల ప్రక్రియ కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉంది. 2017లో ఇంజినీర్ల సీనియార్టీ విషయంలో జోన్–1 ఇంజినీర్లకు, జోన్–4 ఇంజినీర్లకు మధ్య వివాదం చోటు చేసుకుం ది. ఈ విషయంపై అప్పట్లోనే హైకోర్టులో కేసులు సైతం వేశారు. 2021లో నాటి ఈఎన్‌సీగా ఉన్న ఓ ఉన్నతాధికారి జోన్–1 ఇంజినీర్లకు మద్దతుగా నిలిచి ఏపీ హైకోర్టు నుంచి తెలంగాణ హైకోర్టుకు కేసును మార్చాలని సుప్రీం కోర్టును ఆశ్రయించడం తో సీనియార్టీ ఇప్పటి వరకు ఖరారు కాలేదు. ఈ నేపథ్యంలోనే జల వనరుల శాఖలో పదోన్నతులు నిలిచిపోయి ఖాళీగా ఉన్న ఎస్ఈ పోస్టుల్లో ఈఈ లకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ఇంజి నీర్లు చెబుతున్నారు. అయితే, ఇటీవల ప్రభుత్వం మారడంతో ఎలాగైనా ఆ అదనపు బాధ్యతలను దక్కించుకునేందుకు కొందరు ఇంజినీర్లు వివిధ మార్గాల్లో ప్రయత్నాలు మొదలు పెట్టారు. పలు వురు అధికార పార్టీ నేతల సిఫారసు లేఖలతో జల వనరుల శాఖ మంత్రి ఆఫీస్‌కి క్యూ కడుతున్నారు. అధికారపార్టీ నేతల ఒత్తిళ్లను తట్టుకోలేక సదరు శాఖ మంత్రి అడహక్ (తాత్కాలిక) పదోన్నతులు ఇస్తే ఎలా ఉంటుందనే ఆలోచన చేస్తున్నట్లు తెలు స్తోంది. అయితే, ఈ అడహక్ పదోన్నతుల వల్ల రాయలసీమ ప్రాంతానికి చెందిన ఇంజినీర్లకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉన్నట్లు పలువురు ఇం జినీర్లు అభిప్రాయ పడుతున్నారు.

కర్నూలు సర్కిల్ ఎస్ఈ బాధ్యతలకు పోటా పోటీ

కర్నూలు సర్కిల్ ఎస్ఈగా పనిచేసేందుకు పలువురు ఇంజినీర్లు పోటీ పడుతున్నారు. కేసీ కెనాల్ ఈఈగా పని చేస్తున్న ప్రతాప్ నంద్యాల జిల్లాకు చెందిన అధి కార పార్టీ నేతల ద్వారా ప్రయత్నిస్తున్నారు. సర్కిల్ ఆఫీస్‌లో డిప్యూటీ ఎస్ఈగా బాధ్యతలు తీసుకున్న బాలచంద్రారెడ్డి ఉమ్మడి జిల్లాలకు చెందిన మం త్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల మద్దతుతో ఎస్ఈ పోస్టుకు పోటీ పడుతున్నారు.నందికొట్కూరు టీడీపీ నేత మాండ్ర శివానందరెడ్డి సమీప బంధువు పురా ర్ధన్ రెడ్డి ఒంగోలులో పని చేస్తున్నారు. ఈయన సైతం అదనపు బాధ్యతల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అవుకు ఈఈగా పని చేస్తున్న సురేష్ బాబు తన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అని ఎలాగైనా ఎస్ఈ బాధ్యతలు ఇవ్వాలని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ నేరుగా మంత్రి నిమ్మల ఆఫీస్‌కి వెళ్లి కోరినట్లు ఆ శాఖ ఇంజినీర్లు చర్చించుకుంటున్నారు. పురుషోత్తపట్టణం స్కీంలో ఈఈగా పని చేస్తున్న పాండురంగయ్య ఇటీవల బదిలీల్లో ఎల్లెల్సీ ఈఈగా వచ్చారు. అయితే, బాధ్యతలు స్వీకరించలేదు. ఈఈతో పాటు ఎస్ఈగా అదనపు బాధ్యతలు అప్పగించాలని పట్టుబట్టినట్లు సమాచారం. మరో వైపు ప్రస్తుతం ఎస్ఈగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న రెడ్డిశేఖర్ రెడ్డినే ఈ పోస్టులో కొనసాగిం చినా ఆశ్చర్యపోవాల్సిందేమి లేదు.

ప్రజలను అప్రమత్తం చేయండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జిల్లా వ్యాప్తంగా 3 రోజుల పాటు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో ప్రాణ, ఆస్తినష్టం జరగ కుండా ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా కలె క్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫ రెన్స్ హాల్‌లో భారీ వర్షాల నేపథ్యంలో జాగ్రత్త చర్య లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెరువులు, కాలువలు, నీటి వనరుల వద్ద గండ్లు పడకుండా నిరంతరం పర్య వేక్షించాలన్నారు. కొత్తపల్లి మండలంలోని ఎద్దు లేరు వాగు, నంద్యాల పట్టణంలోని మద్దిలేరు వాగు, పాలేరు వాగులు ఉప్పొంగే అవకాశం ఉంద న్నారు. ఆయా చోట్ల ప్రజల రాకపోకలకు ఇబ్బం దులు లేకుండా చూడాలన్నారు. సంక్షేమ వసతి గృ హాల్లో పెచ్చులూడిన భవనాల కింద పిల్లలను ఉం చకుండా చర్యలు తీసుకోవాలని సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల వసతి గృహాల అధికారులకు సూచించారు. జిల్లాలో 27,000 మట్టి మిద్దెలు ఉన్నా యని, వాటిలో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, సీపీఓ వేణుగోపాల్, జిల్లాధికారులు పాల్గొన్నారు.

జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భారీ వర్షాల నేపథ్యంలో నంద్యాల కలెక్టరేట్‌లో జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ రాజకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా అవసరమైతే 08514 – 293903, 08514 – 293908ను నంబర్లకు సంప్రదించాల న్నారు. కంట్రోల్ రూంలో సిబ్బంది అం దుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు.

క్లుప్తంగా

రెండో రోజు కొనసాగిన గాలింపు

పాణ్యం: స్థానిక ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వలో గల్లంతైన వెన్నెల కోసం రెండో రోజు సోమవారం గాలింపు చర్యలు చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్ శంకర్‌రెడ్డి, ఏఎస్‌ఐ రఫీ, వీఆర్‌ఓలు సుంకన్న, బీరేంద్ర, శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ మధుసూదన్ కాల్వ వెంట గాలించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున గాలింపు ఇబ్బందిగా మారింది. కాగా యువతి కుటుంబ సభ్యులు, బంధువులు కాల్వ వద్దకు చేరుకుని కన్నీటిపర్యంతమవుతున్నారు.

ఆటో బోల్తా

- ఆరుగురికి గాయాలు

కోసిగి: మండల పరిధిలోని దుద్ది గ్రామం నుంచి ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనార్థం ఉరుకుందకు ఆటోలో వెళ్తుండగా నేలకోసిగి గ్రామ సమీపంలో ఆటో బోల్తాపడి ఆరుగురు గాయపడ్డారు. దుద్ది గ్రామానికి చెందిన చంద్రమ్మ, చిన్న ఉలిగయ్య, లక్ష్మి, పార్వతిలతోపాటు మరికొందరు సోమవారం ఆటోలో ఉరుకుందకు బయలుదేరారు. నేలకోసిగి గ్రామ సమీపంలో మలుపు వద్ద ఆటో బోల్తాపడింది. ప్రమాదంలో చంద్రమ్మ, లక్ష్మి, ఉలిగయ్య, పార్వతిలతోపాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్య


గూళెప్ప(ఫైల్)

పెద్దకడబూరు: పెట్రోలు పోసుకుని నిప్పు అంటించుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని కంబలదిన్ని గ్రామానికి చెందిన కురువ ఈరన్న రెండో కుమారుడు గూళెప్ప(30) అదే గ్రామానికి చెందిన గోవిందమ్మను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. గూళెప్ప కుటుంబం బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లింది. దసరా పండుగకు స్వగ్రామం కంబలదిన్నికి కుటుంబసమేతంగా వచ్చాడు. సోమవారం జాలవాడికి వెళ్లి.. సచివాలయం సమీపంలో మధ్యాహ్న సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. మంటలకు తాళలేక అరుస్తూ రోడ్డుపై పడిపోయాడు. గమనించిన స్థానికులు మంటలను ఆర్పి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కర్నూలుకు తరలించగా.. అక్కడ కోలుకోలేక మృతిచెందాడు. మృతుడికి దాదాపు రూ.7 లక్షల అప్పు ఉందని, అప్పుల బాధతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

పెళ్లికి అంగీకరించలేదని..


పార్థుడు (ఫైల్)

కర్నూలు: దూరపు బంధువు పెళ్లికి నిరాకరించినందుకు నంద్యాల జిల్లా గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామానికి చెందిన ఆళ్లగడ్డ పార్థుడు (32) సోమవారం ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. కల్లూరు మండలం మారుతీ నగర్‌లో నివాసముంటున్న దూరపు బంధువు అయిన మహిళ తన భర్త చనిపోవడంతో తనను వివాహం చేసుకోవాలని పార్థుడు ఆమె వెంట పడేవాడు. అందుకు ఆమె నిరాకరించడంతో మనస్తాపానికి గురై సోమవారం తెల్లవారుజామున మహిళ ఇంటి ముందు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. కాలిన గాయాలతో పడిపోయి ఉండగా మహిళ సోదరుడు అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించగా కొద్దిసేపటికే మృతిచెందాడు. మృతుని సోదరుడు రాజేష్ ఫిర్యాదు మేరకు నాల్గవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేతులెత్తేసిన సీడ్ ఆర్గనైజర్లు

- ఉమ్మడి జిల్లాకు 98,179 క్వింటాళ్ల శనగ విత్తనాలు అవసరం
- ప్రభుత్వం కేటాయించింది 72,302 క్వింటాళ్లే..
- ఇప్పటి వరకు 30 వేల క్వింటాళ్లు సరఫరా చేసిన సీడ్ ఆర్గనైజర్లు
- రూపాయి కూడా విదిల్చని ప్రభుత్వం
- ఇకపై పేమెంట్ ఇస్తేనే సరఫరా చేస్తామంటూ నిలిపేసిన సీడ్ ఆర్గనైజర్లు

'ఇప్పటికే 30 వేల క్వింటాళ్ల శనగ విత్తనాలు సరఫరా చేశాం. అయినా ప్రభుత్వం రూపాయి కూడా ఇవ్వలేదు. ఇకపై పేమెంట్ ఇస్తేనే విత్తనాలు సరఫరా చేస్తాం. లేకుంటే చేయలేం.' ఇదీ రాష్ట్రంలోని సీడ్ ఆర్గనైజర్ల పరిస్థితి. ఫలితంగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో శనగ విత్తన పంపిణీ నిలిచిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.


ఆస్పరి మండలానికి వచ్చిన నాణ్యత లేని శనగ విత్తనాలను తిప్పి పంపుతున్న అధికారులు(ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో రబీ సీజన్‌లో రైతులు ఎక్కువగా శనగ సాగు చేస్తారు. శనగ విత్తనాల సరఫరాకు ప్రభుత్వం గత నెలలో టెండర్లు పిలిచి నోగోసియస్ ద్వారా క్వింటాల్‌కు రూ.8,900 చెల్లించే విధంగా 35 మంది సీడ్ ఆర్గనైజర్లను ఎంపిక చేసింది. ఈనెల మొదటి వారం నుంచి శనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్‌తోపాటు పంపిణీ కూడా మొదలైంది. ఇప్పటి వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఆర్గనైజర్లు 30 వేల క్వింటాళ్లు సరఫరా చేసినా ప్రభుత్వం రూపాయి కూడా పేమెంట్ చేయలేదు. ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ అధికారులపై ఆర్గనైజర్లు పేమెంట్ కోసం ఒత్తిడి తెస్తున్నా తమ పరిధిలో లేదని దాటవేస్తుండటం.. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో విత్తన సరఫరా నిలిపేసినట్లు తెలుస్తోంది.

డిమాండ్ ఎక్కువ.. కేటాయింపు తక్కువ

రబీ సీజన్‌కు కూటమి ప్రభుత్వం అరకొరగా శనగ విత్తనాలు కేటాయించింది. రబీలో శనగ ప్రధాన పంట. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 1.20 లక్షల హెక్టార్లలో శనగ సాగు చేస్తారు. రబీలో శనగ సాగుకు 54,979.5 క్వింటాళ్ల శనగ విత్తనాలు అవసరమని మండల వ్యవసాయ అధికారులు, ఏడీఏలు నివేదించారు. కానీ ప్రభుత్వం జిల్లాకు 45,955 క్వింటాళ్లు మాత్రమే కేటాయించింది. నంద్యాల జిల్లాకు 43,199.5 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని జిల్లా అధికారులు నివేదించగా.. కేవలం 26,347 క్వింటాళ్లు మాత్రమే కేటాయించింది. ఉమ్మడి జిల్లాకు మొత్తంగా 98,179 క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉండగా.. 72,302 క్వింటాళ్ల విత్తనాలు కేటాయించింది. డిమాండ్‌కు అనుగుణంగా విత్తనాలు కేటాయించకోవడం పట్ల రైతుల నుంచి ఆందోళన వ్యక్తం అవుతోంది. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల రబీలో శనగలను 40 శాతం సబ్సిడీపై పంపిణీ చేసింది. టీడీపీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం 25 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలు పంపిణీ చేస్తుండటం గమనార్హం. సబ్సిడీని తగ్గించడంతో రైతులు నిరాశకు లోనవుతున్నారు. సబ్సిడీపై వ్యవసాయ శాఖ జేజీ–11 రకం శనగ విత్తనాలను పంపిణీ చేస్తోంది. క్వింటాలు శనగలు బహిరంగ మార్కెట్‌లో రూ.7,200 వరకు ఉంటోంది. ప్రభుత్వం మాత్రం రైతులకు పంపిణీ చేసే శనగ విత్తనాలు ధరను కిలో రూ.94 నిర్ణయించింది.(క్వింటాలు ధర రూ.9400), ఇందులో 25 శాతం సబ్సిడీ ఇస్తోంది. కిలోకు 25 శాతం ప్రకారం సబ్సిడీ రూ.23.50 ఉంటుంది. సబ్సిడీ పోగా... రైతులు కిలోకు రూ.70.50 చెల్లించాల్సి ఉంది.

రైతులపై ధర పోటు

విత్తనాలు సరఫరా చేస్తున్న ఆర్గనైజర్లకు క్వింటాల్‌కు రూ.8,900 చెల్లిస్తోంది. ప్రాసెసింగ్ చేసి బ్యాగ్‌తో సహా ఏపీ సీడ్స్ అధికారులు సూచించిన చోట దింపితే ఈ ధర చెల్లిస్తారు. రైతులకు మాత్రం క్వింటాల్ శనగలకు రూ.9,400 ధర నిర్ణయించింది. క్వింటాల్‌కు రైతులపై రూ.500 భారం పడుతోంది. సబ్సిడీ మాత్రం 25 శాతానికే కుదించింది. ప్రభుత్వం శనగ విత్తనాలతో వ్యాపారం చేస్తున్నట్లుగా తెలుస్తోంది. 2014–15నుంచి 2018–19 వరకు టీడీపీ ప్రభుత్వం శనగ విత్తనాలను 33 శాతం సబ్సిడీపై పంపిణీ చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మాత్రం 2019–20 నుంచి 2023–24 వరకు 40 శాతం సబ్సిడీతో పంపిణీ చేసింది. గత ప్రభుత్వం తరహాలో 40 శాతం సబ్సిడీ ఇచ్చి ఉంటే రైతులకు క్వింటాల్‌కు రూ.1,410 ఉపశమం లభించేది. కానీ కూటమి ప్రభుత్వం అలాట్‌మెంట్ తగ్గించడంతో పాటు సబ్సిడీలో కోత విధించడం, ఆర్గనైజర్లకు పేమెంట్ చేయకపోవడం తదితర కారణాల వల్ల విత్తనాల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది.

నాసిరకం విత్తనాలు సరఫరా

సీడ్ ఆర్గనైజర్లతో ఏపీ సీడ్స్ అధికారులు చర్చించి విత్తనాలు సరఫరా చేయాలని ప్రాధేయపడుతున్నారు. దీనిని అవకాశంగా తీసుకొని ఆర్గనైజర్లు నాసిరకం విత్తనాలు సరఫరా చేస్తున్నారు. విత్తనాలను ప్రాసెసింగ్ చేసి 20 కిలోల బ్యాగులు తయారు చేసి జిల్లాలోని వివిధ మండలాల రైతుసేవ కేంద్రాలకు సరఫరా చేయాల్సి ఉంది. ప్రతి లారీని సంబంధిత మండల వ్యవసాయ అధికారి నాణ్యతా ప్రమాణాలను చెక్ చేస్తారు. ఇలా వ్యవసాయ అధికారుల తనిఖీల్లో రెండు లారీల్లో వచ్చిన విత్తనాల్లో నాణ్యత లేదనే విషయం స్పష్టమైంది. ఆలూరులో ఒక లారీ, కోడుమూరులో మరొక లారీ ద్వారా సరఫరా అయిన శనగ విత్తనాల్లో నాణ్యత లేకపోవడం, రాళ్లు, మట్టి పెళ్లలు, పుల్లలు ఉండటంతో వెనక్కి పంపారు.

జోరుగా రిజిస్ట్రేషన్‌లు

ఒకవైపు విత్తనాల పంపిణీ స్తంభించి పోగా.. మరోవైపు విత్తనాల కోసం రైతులు జోరుగా రిజిస్ట్రేషన్‌లు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 25 వేల మందికి పైగా రైతులు 35 వేల క్వింటాళ్ల శనగల కోసం రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వర్షాలు పడుతుండటంతో శనగ సాగుకు అవకాశం ఏర్పడింది. ఇప్పటి వరకు రైతు సేవా కేంద్రాలకు 30 వేల క్వింటాళ్లు సరఫరా చేయగా.. అదంతా రైతులకు పంపిణీ చేశారు. ఇప్పుడు ఆర్గనైజర్లు విత్తన సరఫరాను నిలిపేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం సీడ్ ఆర్గనైజర్లకు పేమెంట్ చేస్తేనే రైతులకు విత్తనం దక్కే పరిస్థితి ఏర్పడింది.

ఇద్దరు వ్యక్తుల ఆత్మహత్య



మృతిచెందిన సుబ్బమ్మ, సాంబశివుడు

అవుకు: మండల పరిధిలోని రామాపురం గ్రామంలో వేర్వేరు కుటుంబాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో ఒకరు మోకాళ్ల నొప్పులు తాళలేక.. మరొకరు పొత్తికడుపు నొప్పితో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామాపురం గ్రామానికి చెందిన చాకలి సుబ్బమ్మ(77) గత పది సంవత్సరాలుగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతోంది. ఈ నొప్పి భరించలేక సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయం చూసి రసాయన పొడరు నీటిలో కలుపుకొని తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు చాకలి లక్ష్మన్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు.

- ఇదే గ్రామానికి చెందిన వడ్డె సాంబశివుడు(46) కొద్ది కాలంగా మూత్ర సంబంధ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ సమస్యతో తరచుగా పొత్తికడుపు నొప్పి వస్తుంది. భరించలేక సోమవారం ఇంట్లో రసాయన ద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు భార్య వడ్డె మద్దమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రామయ్య తెలిపారు.

కొండ చిలువ కోసం గాలింపు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో సంచరిస్తున్న కొండ చిలువ కోసం అటవీ శాఖ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి న్యూ లైబ్రరీ బిల్డింగ్ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు గుర్తించారు. సోమవారం వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వర్లు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖ కర్నూలు డివిజన్ ఎఫ్ఆర్‌ఓ విజయకుమార్ ఆధ్వర్యంలో ఆ శాఖ సిబ్బంది కొండ చిలువ సంచరించిన ప్రాంతాన్ని గాలించారు. అయినా ఆచూకీ లభించలేదు.

రమణీయం..రథోత్సవం


మాళ మల్లేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు హారతి ఇస్తున్న పూజారులు


మాళ మల్లేశ్వరస్వామి రథోత్సవ దృశ్యం

హొళగుంద: మాళ మల్లేశ్వరస్వామి రథోత్సవం సోమవారం రాత్రి రమణీయంగా సాగింది. దేవరగట్టు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు రథోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంతకు ముందు ఉదయం కొండపై వెలిసిన ఆలయంలో మాత మాళమ్మ, మల్లేశ్వరస్వామి విరాట్‌మూర్తులకు పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బిలేహాళ్ నుంచి గట్టుకు చేరిన కుంభం..

రథోత్సవానికి ముందు మల్లప్ప గుడిలోని సింహాసన కట్టపై జైత్రయాత్ర అనంతరం అధిష్ఠించిన ఉత్సవమూర్తులకు పూజారులు అభిషేకాలు, మహా మంగళహారతి, ఆకుపూజలు నిర్వహించారు. సాయంత్రం బిలేహాళ్ గ్రామం నుంచి కుంభం, గజమాల దేవరగట్టుకు చేర్చి రథాంగ పూజలు నిర్వహించారు. అశేష భక్త జనుల జయజయ ధ్వనుల మధ్య రథాన్ని లాగారు. రథోత్సవం ఎదురు బసవన్నగుడి వరకు సాగింది. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి కనులారా వీక్షించారు. ఉత్సవంలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య నేతృత్వంలో ఆలూరు సీఐ శ్రీనివాసనాయక్ ఆధ్వర్యంలో హొళగుంద ఎస్ఐ బాలనరసింహులు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

నేడు గొరవయ్యల ప్రదర్శన, గొలుసు తెంపుట

మండలంలోని దేవరగట్టులో బన్ని ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గొరవయ్యల ప్రదర్శన, గొలుసు తెంపుట, దేవదాసిల ప్రదర్శనలు జరగనున్నాయి. బన్ని ఉత్సవంలో రెండో ప్రధాన ఘట్టమైన గొరవయ్యల ఆటలను చూడడానికి రాష్ట్ర నలమూలాల నుంచే కాకా తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గొరవయ్యలు, గురు గొరవయ్యలు, పిల్ల గొరవయ్యల నృత్యాలు, బళ్లారుకు చెందిన గొరవయ్య గొలుసు తెంపడం భక్తులను ఆకట్టుకుంటాయి. సాయంత్రం దేవదాసిల క్రీడోత్సవాలు, వసంతోత్సవం జరుగుతాయి. అనంతరం మాళ మల్లేశ్వరస్వామి విగ్రహాలు, పల్లకీ కంకణ విసర్జనలో భాగంగా గిరి పైనున్న ఆలయానికి చేరుతాయి. అక్కడి నుంచి బుధవారం నెరణికి గ్రామానికి చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయి.

దైవదర్శనానికి వెళ్లొచ్చేలోపు ఇల్లు గుల్ల చేశారు

- కిలో వెండి, ఆరు తులాల బంగారు నగలు చోరీ

కర్నూలు: కల్లూరు మండలం దూపాడు గ్రామ సమీపంలోని అశోక్ లేల్యాండ్‌కు ఎదురుగా ఉన్న సన్ సిటీలో నివాసముంటున్న భూమా భరత్ రెడ్డి ఇంట్లో దొంగలు పడి అందినమట్టుకు మూటగట్టుకుని ఉడాయించారు. ప్రకాశం జిల్లా మిట్టపల్లి నారాయణస్వామి ఆలయం దర్శనం కోసం శనివారం కుటుంబ సభ్యులతో కలసి ఇంటికి తాళం వేసి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు తలుపుల తాళాలు విరగ్గొట్టి లోపలికి ప్రవేశించి పడక గదిలో ఉన్న బీరువాను బద్దలుగొట్టి అందులో ఉన్న కిలో వెండి, గిఫ్ట్ ఆభరణాలు, 6 తులాల బంగారు నగలు మూటగట్టుకుని ఉడాయించారు. సోమవారం ఉదయం భరత్ ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. గదిలోకి వెళ్లి చూడగా బీరువాలోని సామాన్లన్నీ చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని ఉలిందకొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కర్నూలు తాలూకా సీఐ చంద్రబాబు, ఎస్ఐ ధనుంజయ అక్కడికి చేరుకుని నేరం జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు.

అయ్యలూరుమెట్టలో చోరీ

బొమ్మలసత్రం: నంద్యాల మండలం అయ్యలూరు మెట్టలోని ఓ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. వ్యవసాయం చేస్తూ జీవనం సాగించే ప్రభాకర్‌రెడ్డి ఆదివారం కుటుంబంతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం తిరిగి ఇంటికి రాగానే తలుపులు తెరిచి ఉన్నాయి. వెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని 5 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. చోరీ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీఐ ఇస్రార్‌బాషా తెలిపారు.

చిన్నపిల్లలు అదృశ్యం

- ఆటోడ్రైవర్ల సాయంతో తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు


చిన్నారుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

కర్నూలు: నగర శివారులోని మారుతీ మెగా సిటీ శ్రీనిధి అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న అభినవ్ రెడ్డి (6), హరిచరణ్ (5) జామకాయలు కొనుక్కునేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లి సోమవారం ఉదయం తప్పిపోయారు. అభినవ్‌రెడ్డి తండ్రి సుధీర్ కుమార్‌రెడ్డి రాయలసీమ యూనివర్సిటీలో ఉద్యోగి. హరిచరణ్ తండ్రి మల్లికార్జున అపార్ట్‌మెంట్‌కు వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం ఉదయం ఇద్దరు పిల్లలు డబ్బులు తీసుకుని జామకాయల కోసం బయటకు వెళ్లి ఎంతసేపటికీ ఇళ్లకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేశారు. కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ మురళీధర్‌రెడ్డి, ఎస్ఐ మన్మథ విజయ్ తమ సిబ్బందితో బృందాలుగా ఏర్పడి మూడు గంటల్లో పిల్లల ఆచూకీ కనుగొని తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. పిల్లలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసు వాట్సాప్ గ్రూప్‌తోపాటు ఆటోడ్రైవర్లకు సమాచారం చేరవేశారు. సి.క్యాంప్ ఎంప్లాయీస్ కాలనీలో ఉండే మహిళలు పిల్లలను గుర్తు పట్టి వారు చదివే మాంటిస్సోరి స్కూల్ ఆటోడ్రైవర్లకు అప్పగించారు. వారి సాయంతో పోలీసులు పిల్లలను తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్ ఉపేంద్రనాయక్, బుజ్జి, బాలరాజు తదితరులను సీఐ అభినందించారు. చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు.

మధ్యాహ్న భోజనం ఆలస్యం

- ఆకలితో అలమటించిన విద్యార్థులు


ఖాళీ ప్లేట్లతో విద్యార్థులు

ఆదోని రూరల్: వంట ఏజెన్సీలో తలెత్తిన వివాదం వల్ల మండలంలోని ఆరేకల్ జెడ్పీ పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజనం ఆలస్యమై విద్యార్థులు ఆకలితో అలమటించారు. పాఠశాలలో 450 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి మధ్యాహ్న భోజనాన్ని శ్రీ రాజేశ్వరి పొదుపులక్ష్మి గ్రూపు సభ్యులు తయారు చేసేవారు. అయితే దసరా పండగ సెలవుల్లో శ్రీ రాజేశ్వరి పొదుపులక్ష్మి గ్రూపును తప్పించి శ్రీ రాఘవేంద్రస్వామి పొదుపులక్ష్మి గ్రూపు సభ్యులకు మధ్యాహ్న భోజన తయారీ బాధ్యతలు అప్పగించినట్లు త్రిసభ కమిటీ ఆర్డర్ కాపీ ఇచ్చింది. ఆ కాపీతో సభ్యులు పాఠశాల వద్దకు చేరుకుని మధ్యాహ్న భోజనం తయారు చేస్తామని రాగా .. పాత గ్రూపు సభ్యులకు మద్దతు తెలిపే నాయకుతో జరిగిన వివాదం వల్ల భోజనం తయారీ ఆలస్యమైంది. చివరగా నూతన ఆర్డర్ కాపీ తెచ్చుకున్న సభ్యులు బయట నుంచి భోజనం తయారు చేసుకుని వచ్చి విద్యార్థులకు వడ్డించారు. హెచ్ఎం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఏజెన్సీ మార్పు విషయం ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. 54 మంది విద్యార్థులు హాజరు కాగా వారికి, నూతన ఏజెన్సీ వారు బయట నుంచి భోజనం తయారు చేసుకుని వచ్చి పెట్టారని, మంగళవారంలోపు సమస్య పరిష్కారమవుతుని చెప్పారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


మృతదేహాన్ని బయటకు తీసిన దృశ్యం

మహానంది: తెలుగుగంగ కాల్వలో గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. వైఎస్సార్ జిల్లా బద్వేల్‌కు చెందిన సురసుర గౌతం(17) మహానందిలోని ఓ వివాహానికి వస్తూ ప్రమాదవశాత్తు తెలుగుగంగ కాల్వలో పడిన బావ మహేష్‌ను కాపాడేందుకు వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే. ఈ మేరకు గాజులపల్లె రైల్వేస్టేషన్, బసవాపురం గ్రామాల సమీపంలోని తెలుగుగంగ కాల్వ 14వ బ్లాక్ వద్ద యువకుడి మృతదేహం గుర్తించిన స్థానికులు వెంటనే మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డికి సమాచారం అందించారు. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని కాలువలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం గౌతం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. కుమారుడి మృతితో తల్లి సురసుర మహాలక్ష్మి, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

పాత వాహనాలకు ఈ-వేలం

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో కాలం చెల్లిన (పాత) వాహనాలకు ఈ నెల 25వ తేదీన ఈ-వేలం వేయనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్. భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 13 వాహనాలను ఏపీ కొనుగోలు పోర్టల్ ద్వారా స్క్రాప్ కింద వేలం వేస్తామన్నారు.

నేడు సెపక్‌తక్రా ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి సెపక్‌తక్రా సీనియర్ పురుషులు, మహిళలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులు ఈనెల 22, 23 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించనున్న సీనియర్స్ మహిళ, పురుషుల సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొంటారని ఆయన వెల్లడించారు. వివరాలకు 94402–57242 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పల్లె.. వలస బాట

చేద్దామంటే పని లేదు.. ఇంట్లో కూర్చొని ఉంటే కుటుంబం గడవదు. అందుకే పల్లెలు సుగ్గి బాట పడుతున్నాయి. దసరా పండగ పూర్తి కావడంతో సోమవారం మండల పరిధిలోని దుద్ది గ్రామానికి చెందిన హనుమంతు, అంజినయ్య, గుండయ్య, జొక్కల రామయ్య, అంపయ్య, మారయ్య, దేశాయి ఈరన్న తోపాటు 30 మంది కర్ణాటక రాష్ట్రానికి వలస వెళ్లారు. అక్కడ పత్తి తీసే పనులు ఉన్నట్లు కూలీలు తెలిపారు. గ్రామంలో పనులు లేకపోవడంతో పిల్లలను బతికించుకోవడం కష్టంగా ఉందని, ఉపాధి పనులు చేసినా కూలీ గిట్టుబాటు కావడం లేదని, అందుకే కొన్నాళ్లు సుగ్గికి పోయి వస్తామని కూలీలు తెలిపారు.

– కోసిగి


వలస వెళ్తున్న దుద్ది గ్రామ కూలీలు

కర్ణాటక లారీ డ్రైవర్ మృతి

ప్యాపిలి: పట్టణ సమీపంలోని స్థానిక పెద్దమ్మ దాబా వద్ద కర్ణాటక రాష్ట్రం హసన్ జిల్లాకు చెందిన లారీ డ్రైవర్ హరీష్ (45) మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. మృతుడు హరీష్ అరుణాచల ట్రాన్స్‌పోర్టు లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 13 వ తేదీ రాచర్ల వద్ద ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి సిమెంట్ లోడుతో హసన్ జిల్లాకు బయలుదేరాడు. ప్యాపిలి సమీపంలోని పెద్దమ్మ దాబా వద్ద లారీని ఆపుకుని టైర్లను పరిశీలిస్తూ ఆకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. విషయం తెలుసుకున్న హైవే అంబులెన్సు సిబ్బంది పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. సోమవారం మృతుడి భార్య స్మిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ప్యాపిలి పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.